క్లుప్తంగా

ఘనంగా రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించారు. స్వయంభు శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి మూల విగ్రహాలకు ఉదయం అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మునిరాజ, వంశపారం పర్య ధర్మకర్త విజయకుమార్, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ బెన్నురాజ్

బంగారుపాళెం: మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను సోమవారం తహసీల్దార్ బెన్నురాజ్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ, మార్చి 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మండలంలో 145 టీచర్స్, 2,210 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాజేంద్ర, వీఆర్ఓ పునీత్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలం



పూతలపట్టు: ఎక్సైజ్ శాఖలో పట్టుబడిన వాహనానికి పోలీసులు సోమవారం పూతలపట్టు పోలీసు స్టేషన్‌లో వేలం పాట నిర్వహించారు. పల్లిపట్టుకు చెందిన వినాయకం జీఎస్టీతో కలిపి కారు ధర రూ.1,71,100కు దక్కించుకున్నట్లు పోలీసులు తెలిపారు.

తవణంపల్లె: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం పాటలు నిర్వహించి విక్రయించినట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన ఐదు వాహనాలకు సోమవారం వేలం పాట నిర్వహించారు. ఇందులో రెండు వాహనాలను రూ.90 వేలుకు దక్కించుకున్నారని వివరించారు. మరో మూడు వాహనాలు స్టేషన్‌లో ఉన్నాయని వివరించారు.

అంగన్‌వాడీ కేంద్రానికి వస్తువుల వితరణ



నిత్యావసర వస్తువులు అందజేస్తున్న శివ

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని దొడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రానికి సోమవారం పలు వస్తువులను వితరణ చేశారు. దొడ్డిపల్లెకు చెందిన దలవాయి శివ జన్మదినాన్ని పురస్కరించుకుని అంగన్‌వాడీ కేంద్రంలో నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో దొడ్డిపల్లి కార్పొరేటర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

పచ్చపురుగు నివారణ

పిచ్చాటూరు: తులసికృష్ణాపురంలో రైతులు సాగు చేసిన ప్రొద్దు తిరుగుడు పంటకు మొగ్గ దశలో సోకిన శనగ పచ్చ పురుగు నివారణకు వ్యవసాయ అధికారులు చర్యలు చేపట్టారు. పంటలో శనగపచ్చపురుగు ఉధృతంగా ఉందని గుర్తించారు. ఆ పురుగు నివారణకు నెంల్యూరోన్, ఇండాక్స్‌కార్బ్ కలిపి ఎకరానికి 350 మిల్లీ లీటర్ల చొప్పున పిచికారి చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు శ్రీనివాసులు, దివ్య, వ్యవసాయ సహాయకులు గజలక్ష్మి, ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

శ్రీరంగరాజపురం: మండలంలోని మంగుంటలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం అంకురార్పణతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. వేకువ జామున ఆలయంలో అర్చక బృందం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అభిషేక పూజలు చేశారు. సాయంత్రం ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, ధ్వజారోహణం చేశారు. ఆలయ ధర్మకర్త ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మార్చి 8వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. ప్రతి రోజు ఉదయం 9 గంటలకు హోమం, 11గంటలకు అభిషేకం, సాయంత్రం 4 గంటలకు కల్యాణోత్సవం, 6 గంటలకు వాహన సేవ, 8 గంటలకు ఊంజల్‌సేవ నిర్వహిస్తామని చెప్పారు. రోజు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి, అన్నదానం చేస్తామన్నారు. ఉత్సవాలకు ఉభయకర్తలుగా సుబ్రమణ్యంరెడ్డి,జయచంద్రారెడ్డి, పెరుమాల్ రెడ్డి, శేఖర్ రెడ్డి, లోకనాథరెడ్డి తదితరులు వ్యవహరించారు.



సారెను తీసుకువెళుతున్న ఉభయకర్తలు



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు సంధ్య. మండలంలోని వసంతాపురం గ్రామానికి చెందిన ఈమె స్వయం సహాయక సంఘంలో సభ్యు రాలు. ఈమెకు పీఎంఈజీపీ కింద రూ.లక్ష రుణం మంజూరైంది. ఆ రుణంతో వైఎస్సార్ క్రాంతి పథం కింద మట్టిబొమ్మల తయారీ యూనిట్ పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకుంటోంది. ప్రభుత్వం రూ.35వేలు సబ్సిడీ ఇచ్చింది. గతం కంటే మంచి జీవితాన్ని సాగిస్తున్నట్లు సంధ్య సంతోషం వ్యక్తం చేసింది.



ఈ ఫొటోలోని మహిళ పేరు నళిని. గుడిపాల మండలం నంగమంగళంకు చెందిన ఈమె ఇటుక బట్టీల ఏర్పాటుకు రుణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో రూ.లక్ష రుణం మంజూరైంది. ఆ మొత్తంతో ఇటుక బట్టీల తయారీ యూనిట్ ప్రారంభించారు. ప్రతినెలా కొంత ఆదాయం పొందుతున్నారు. బ్యాంకు మంజూరు చేసిన రుణంలో ప్రభుత్వం రూ.35వేలు సబ్సిడీగా అందజేసింది. ఇటుక బట్టీనే ప్రస్తుతం తన కుటుంబానికి జీవనాధారమని నళిని ఆనందంగా చెబుతోంది

కుటీరం.. కుటుంబానికి ఊతం

ఉపాధి లేని గ్రామీణులకు కుటీర పరిశ్రమలే జీవనోపాధి కల్పిస్తున్నాయి. పేద కుటుంబాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. ఇలాంటి చిన్న యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వాలు సబ్సిడీ రుణాలు అందిస్తున్నాయి. డ్వాక్రా మహిళలకు రుణాలందించి గ్రామీణ పారిశ్రామికవేత్తలుగా మార్చుతున్నాయి. పల్లెసీమల్లోనూ ప్రతి కుటుంబంలో ఆర్థిక స్వావలంబనకు చేయూతనందిస్తున్నాయి.

- విరివిగా రుణాలందిస్తున్న ప్రభుత్వం
- కుటీర పరిశ్రమల ఏర్పాటే లక్ష్యం
- గ్రామాల్లో మహిళలకు ఆదాయం

గుడిపాల: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు ప్రభుత్వం సువర్ణావకాశం అందిస్తోంది. డిస్ట్రిక్ ఇండస్ట్రీస్ సెంటర్ (డీఐసీ), ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డ్ (కేవీఐబీ) ఆధ్వర్యంలో విరివిగా సబ్సిడీ రుణాలను అందజేస్తోంది. మహిళలు కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకొని, ఆర్థిక స్వావలంబన సాధించడమే ధ్యేయంగా ప్రభుత్వం అడుగులేస్తోంది. డీఆర్‌డీఏ, వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా ఇప్పటికే జిల్లాలోని మహిళలకు విరివిగా సబ్సిడీ రుణాలు మంజూరయ్యాయి. వందల సంఖ్యలో యూనిట్లు ప్రారంభమయ్యాయి. ఆసక్తి కలిగిన మహిళలు రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సంబంధిత అధికారులు కోరుతున్నారు.

ఎవరు అర్హులు

జిల్లా వ్యాప్తంగా స్వయం సహాయక సంఘంలోని సభ్యులైన మహిళలు ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారంటీ ప్రోగ్రామ్(పీఎంఈజీపీ) కింద రుణాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారుల వయస్సు 18 నుంచి 55 ఏళ్ల మధ్య ఉండాలి. కనీస విద్యార్హత 8వ తరగతి. దరఖాస్తుదారు కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉండకూడదు. ఇంటిపన్ను, కరెంట్‌బిల్లు, పాన్‌కార్డ్ కలిగి ఉండాలి. గ్రామైక్య సంఘాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుదారులు తప్పనిసరిగా మంచి సిబిల్ స్కోర్ కలిగి ఉండాలి.

కుటీర పరిశ్రమల యూనిట్లు

వైఎస్సార్ క్రాంతి పథం (వైకేపీ) ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేసే యూనిట్లు 238 వరకు అందుబాటులో ఉన్నాయి. పేపర్‌ప్లేట్ల తయారీ, టెంట్ హౌస్, మినీరైస్ మిల్లు, పిండిమిల్లు, ఫొటో స్టుడియో, వత్తుల తయారీ, కుండల తయారీ, ఇటుక బట్టీల ఏర్పాటు, చెప్పులు, బూట్ల తయారీ, కెమికల్ ఇండస్ట్రీ తదితర యూనిట్ల ఏర్పాటుకు రుణాలు మంజూరు చేస్తారు. రుణాలు మంజూరైన లబ్ధిదారులు తప్పనిసరిగా యూనిట్లు ప్రారంభించాలి.

35 శాతం సబ్సిడీ

జిల్లా పరిశ్రమల కేంద్రం (డీఐసీ), ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డ్(కేవీఐబీ) ఆధ్వర్యంలో అర్హులైన మహిళలకు కనీసం రూ.50వేల నుంచి 10 లక్షల రూపాయల వరకు రుణాలు మంజూరు చేస్తారు. బ్యాంకులు అందించే వడ్డీకే రుణాలు మంజూరు చేస్తారు. మంజూరు చేసే రుణాల్లో 35 శాతం వరకు సబ్సిడీగా ప్రభుత్వం అందిస్తోంది. లబ్ధిదారులు తాము తీసుకున్న రుణాలకు సంబంధించిన వాయిదాలను మూడేళ్ల పాటు సక్రమంగా చెల్లించినట్లయితే సబ్సిడీ మొత్తాన్ని విడుదల చేస్తారు.

దరఖాస్తు చేసుకోవాలి



డీఐసీ, కేవీఐడీ ఆధ్వర్యంలో ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాల కోసం స్వయం సహాయక సంఘ మహిళలు డీఆర్‌డీఏ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న తరువాత కుటీర పరిశ్రమల ఏర్పాటు ద్వారా మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే మహిళలకు సబ్సిడీ ద్వారా రుణాలు అందించాం. మిగతా సభ్యులకు కూడా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం.

– ఈశ్వరి, ఏపీయం, గుడిపాల

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

తవణంపల్లె: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్నట్లు పశువైద్యాధికారులు లావణ్య, పల్లవి తెలిపారు. మండలంలోని మార్చి 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు గ్రామాల్లో తిరిగి టీకాలు వేయనున్నట్లు చెప్పారు. రైతులు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకొని సహకరించాలని కోరారు.

అధ్యాపకుడికి డాక్టరేట్



దండపాణి

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకుడి పని చేస్తున్న రాంనగర్ కాలనీకి చెందిన దండపాణికి డాక్టరేట్ ప్రధానం చేశారు. కుప్పం ద్రవిడియన్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ అనురాధ ఆధ్వర్యంలో ఫర్క్యాస్టింగ్ ఆఫ్ డైలీ రెయిన్ పాల్ బై అప్లయింగ్ బ్యాక్ ప్రాపగేషన్ ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్ టెక్నిక్ యూజింగ్ సర్‌ఫేస్ డేటా అనే అంశంపై పరిశోధన చేశారు. ఇందుకు గాను దండపాణికి ఆ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

ఐరాల: రబీలో సాగు చేసిన పంటలకు ఈ–క్రాప్ నమోదు చేసుకోవడానికి 28వ తేదీ చివరి అవకాశం అని ఏఓ వరలక్ష్మి తెలిపారు. వ్యవసాయాధికారి కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ ప్రతి రైతూ సాగు చేసిన పంటల వివరాలను రైతు భరోసా కేంద్రానికి వెళ్లి వ్యవసాయ సహాయకుడి ద్వారా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని స్పష్టం చేశారు. ఈ-పంట నమోదు చేయించుకోని రైతులకు ప్రభుత్వ పథకాలైన కనీస మద్దతు ధర, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇతర పథకాలు వర్తించవన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌కు అనూహ్య స్పందన



తవణంపల్లె: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ప్రియాంక



ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న పూర్ణలత

తవణంపల్లె: మండలంలోని ఎగువ మారేడుపల్లె, మాధవరం గ్రామాల్లో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక 105 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. గర్భవతులు రక్తహీనత లేకుండా ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గర్భవతులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నాంపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని నాంపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత 104 వైద్య శిబిరంలో 80 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం మంచానికే పరిమితమైన రోగుల ఇంటి వద్దకే వెళ్లి వైద్య సూచనలు, సలహాలు ఇచ్చారు. పీహెచ్‌సీ పరిధిలో ఉన్న అన్ని సచివాలయాల్లో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు అందుబాటులో ఉండి ప్రతి రోజు వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు. ఆయుష్మాన్ సర్వే పూర్తయితే దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు దేశంలో ఏ ఆస్పత్రికైనా వెళ్లి కార్డు చూపితే ఉచితంగా వైద్య సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

9 సార్లు చలానా కట్టినా సర్వే చేయలేదు



చలనా రశీదు చూపుతున్న సుబ్రమణ్యం

యాదమరి: ''మా భూమిని కొందరు ఆక్రమించుకొని ఉన్నారు, హద్దులు చూపించాలని తొమ్మిది సార్లు చలానా కట్టినా సర్వే అధికారులు సర్వే చేయలేదు..'' అంటూ దాసరాపల్లె సర్పంచ్ సుబ్రమణ్యం తహసీల్దార్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు యాదమరి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ చిట్టిబాబుకు వినతి పత్రం అందించారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూమండల సర్వేయర్ ద్వారా సర్వే చేయిస్తామని, సచివాలయ సర్వేయర్ ఎందుకు సర్వే చేయించడం లేదని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

స్పందన వినతులకు సత్వర పరిష్కారం



ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్ పార్వతి

చిత్తూరు అర్బన్: స్పందనకు వచ్చిన వినతులకు సత్వర పరిష్కారం చూపాలని చిత్తూరు నగరపాలక కమిషనర్ అరుణ తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఆమె నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో 5 వినతులు అందినట్లు తెలిపారు. ఈ ఫిర్యాదులను సకాలంలో క్షేత్రస్థాయిలో విచారణ చేసి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ -3 టౌన్ ప్లానింగ్-2, ప్రజారోగ్య విభాగం-1 చొప్పున వినతులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ ధనలక్ష్మి, ఎంహెచ్వో డా.లోకేష్, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో...

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ పార్వతి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. దారి తగదాలు, భూ సమస్యలు, పట్టా మార్పిడి తదితర సమస్యలకు సంబంధించి మొత్తం 23 అర్జీలు అందాయి. వాటిని పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆమె వీఆర్‌ఓలకు ఆదేశించారు.

దళిత కళాకారులకు గుర్తింపు కార్డులివ్వాలి



మాట్లాడుతున్న డప్పు కళాకారులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: దళిత డప్పు కళాకారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని రాష్ట్ర దళిత డప్పు కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. చిత్తూరులో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డప్పు కళాకారుల సమస్యల పరిష్కారం కోసం మార్చి చివరి వారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్లు పేర్కొన్నారు. వారికి గుర్తింపు కార్డులు మంజూరు విషయంలో అలసత్వం సరికాదని చెప్పారు. నిత్యావసర ధరలు ఇష్టారాజ్యంగా పెంచడం సరికాదన్నారు. పన్నులు వందల్లో పెంచుతూ సంక్షేమం కోసం రూపాయల్లో ఖర్చు చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు కుమార్‌రెడ్డి, నాగరాజన్, జగ్గయ్య, హరి తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామి ఆలయ కుంభాభిషేకం



కుంభాభిషేక పూజలు చేస్తున్న అర్చకులు, గ్రామస్తులు

గుడిపాల: మండలంలోని చెరువుముందరవూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన వేణుగోపాల స్వామి ఆలయ కుంభాభిషేక వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా గణపతిపూజ, పుణ్యాహవచనం, వాల్మీకి పూజ, అంకురార్పణను వేదపండితుల మధ్య నిర్వహించారు. మధ్యాహ్నం 2గంటలకు టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో హరికథా కాలక్షేపం సాగింది. సాయంత్రం 6 గంటలకు గణపతి ప్రార్థన, వేదపారాయణం, కలశప్రతిష్ట, తిరుమంజనం, గ్రామోత్సవాలను నిర్వహించారు. మరో రెండు రోజుల పాటు కుంభాభిషేక మహోత్సవాలు ఉంటాయని గ్రామస్తులు తెలియజేశారు.

పెరటి కోళ్ల పెంపకంతో ఆదాయం

పాలసముద్రం : మండలంలోని డ్వాక్రా సంఘాల సభ్యులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పెరటి కోళ్ల పెంపకంతో మంచి ఆదాయం పొందవచ్చని వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ తెలిపారు. శుక్రవారం పాలసముద్రం సచివాలయ ఆవరణలో ఎంపీడీఓ ఎస్ విద్యావతి ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాల సభ్యులకు పెరటి కోళ్ల యూనిట్లు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ మాట్లాడుతూ రూ.3 వేలు విలువ చేసే 11 కోళ్లు ఉన్న యూనిట్‌తోపాటు మెడికల్ కిట్‌ను కూడా ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. పెరటి కోళ్ల పెంపకంతో మంచి ఆదాయం వచ్చి మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్‌లు అయ్యప్ప, నరసింహరాజు, జీవిత, శోభ, ఎంపీటీసీ సభ్యుడు గోవిందరాజులు పాల్గొన్నారు

'ఆస్తి పన్ను'కు వేళాయెె!



చిత్తూరు నగరంలోని భవనాలు

మార్చి వస్తోందంటేనే పన్నుల మోత మోగుతుంది. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆస్తి పన్నుల వసూళ్లకు అధికారులు ఈ ఏడాది పెద్ద లక్ష్యాన్నే ముందు ఉంచుకున్నారు. పన్నుల రూపంలో వచ్చిన మొత్తాన్నే నగర అభివృద్ధికి వినియోగించాలన్న విషయాన్ని ప్రజలు గుర్తించి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పన్నులు చెల్లించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే సమయంలో మొండి బకాయిదారుల భరతం పడుతూ ఆస్తుల జప్తుతో పాటు వివరాలను గోడలపైకి ఎక్కించడానికి సిద్ధమవుతున్నారు.

- మార్చి నెలాఖరుకు రూ.14.06 కోట్ల లక్ష్యం
- రంగంలోకి మున్సిపల్ యంత్రాంగం..
- మొండి బకాయిదారుల వివరాలు గోడలపైకి

పన్ను వివరాలు	రూ. కోట్లలో
ఏడాది ఆస్తిపన్ను లక్ష్యం	– 16.44
పాత బకాయిలు	– 13.34
మొత్తం	– 29.78
ఇప్పటి వరకు వసూలైంది	– 15.72
వసూలు కావాల్సింది	– 14.06
నగరంలోని భవనాల సంఖ్య	– 41,820
గడువు సమయం	– మార్చి 31

చిత్తూరు అర్బన్: ప్రతీ ఏటా ఆయా వార్షిక ఆస్తి పన్నులను వసూలు చేయడంలో మున్సిపల్ సిబ్బంది తీరు ఆశాజనకంగానే ఉన్నా.. మిగిలిపోతున్న బకాయిలపై ఎవరూ పెద్దగా దృష్టి పెట్టడం లేదు. ఫలితంగా అప్పుడప్పుడే మిగిలిపోతున్న బకాయిలు ఒక్కసారిగా భారీగా చేరి మొండిబకాయిలుగా మారిపోతున్నాయి. ఆర్థిక సంవత్సరానికి చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.16.44 కోట్లు ఆస్తిపన్ను రూపంలో వసూలు కావాల్సి ఉండగా.. పాత బకాయిలు రూ.13.34 కోట్లు ఉన్నాయి. మొత్తం కలిపి రూ.29.78 కోట్లు మార్చిలోపు వసూలు కావాలి. ఇందులో ఇప్పటి వరకు రూ.15.72 కోట్లు వసూలైతే, కార్పొరేషన్ ఆర్థిక పరిస్థితికి ఢోకాలేదు. ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో నెల రోజుల గడువు మాత్రమే మిగిలింది. ఈ గడువులోపు అధికారులు దాదాపు రూ.14కోట్లపైనే వసూలు చేయాల్సి ఉంది. ఇది కాకుండా ప్రభుత్వ భవనాల నుంచి కార్పొరేషన్‌కు పెద్దమొత్తంలో బకాయిలు ఉన్నాయి.

పరువు నిలబెడతారా?

చిత్తూరు కార్పొరేషన్‌గా రూపొందాక 14 పంచాయతీలు విలీనం చేయడంతో మొత్తం 43 రెవెన్యూ వార్డులుగా ఏర్పడ్డాయి. రెవెన్యూ విభాగంతోపాటు పన్నుల వసూలుకు ప్రస్తుతం ఆయా వార్డు సచివాలయ కార్యదర్శులను సైతం రంగంలోకి దింపారు. వీళ్లను పర్యవేక్షించడానికి కార్యాలయ మేనేజరు, సహాయ కమిషనరు, పట్టణ ప్రణాళిక అధికారి, ఇంజనీరింగ్ ఇతర అధికారులు సూపర్‌వైజర్లుగా ఉన్నారు. మార్చి నెలాఖరులోపు మొత్తం వసూలు చేస్తేనే చిత్తూరు కార్పొరేషన్ జిల్లాలోని మిగిలిన మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలిచే అవకాశం ఉంటుంది.



పన్ను వసూలులో సచివాలయ కార్యదర్శులు

ఎవరినీ వదలం

ఇది మన ఊరు. మనమంతా సకాలంలో ఆస్తిపన్ను, నీటి పన్ను చెల్లిస్తేనే నగరంలో అభివృద్ధి పనులు చేయడం సాధ్యమవుతుందనే విషయాన్ని ప్రజలు గ్రహించాలి. ప్రతీ ఒక్కరూ చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా వీలైనంత త్వరగా పన్నులు చెల్లించండి. కార్పొరేషన్ కార్యాలయంలో పన్ను వసూలు కేంద్రాలు సెలవు రోజుల్లో కూడా పనిచేస్తున్నాయి. ఇదే సమయంలో మొండి బకాయిదారుల ఆస్తులను జప్తు చేయడానికి ముందుకు వెళుతున్నాం. వీళ్ల జాబితాను ప్రతీ సచివాలలయంలోని గోడలపై అతికించే విషయం పరిశీలిస్తున్నాం. అంత వరకు తెచ్చుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం.

– డా.అరుణ, కమిషనర్, చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్